# జనపదం

J A N A P A D H A M

హైదరాబాద్ | బుధవారం 02 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 115

తెలుగు దినపత్రిక


## సాయం అందింది..

- తెలుగు రాష్ట్రాలకు కేంద్రం వరద ఉపశమనం...
- తెలంగాణకు రూ. 416 కోట్లు.. ఏపీకి రూ.1036 కోట్లు
- ప్రాథమిక నివేదికల ప్రకారం నిధులు
- కేంద్ర బృందాల పూర్తి నివేదిక తర్వాత మరిన్ని..
- ప్రకటించిన కేంద్ర హోం శాఖ

4





## మళ్లీ కూల్చివేతలు..

- మూసీ లో కొనసాగుతున్న బుల్డోజర్ల విధ్వంసం..
- భారీ భద్రత నడుమ మార్కింగ్..
- నది పరివాహంలో 16 వేల నివాసాలున్నట్టు గుర్తింపు..
- శంకర్ పల్లిలో స్వచ్ఛందంగా ఖాళీ చేసిన జనం..
- మూసీ సుందరీకరణకు సర్కార్ దూకుడు..

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** మూసీ పై ఇంత గొడవ జరుగుతున్న కూల్చివేతలు ఆగడం లేదు. మంగళవారం మూసీలో మళ్లీ కూల్చివేతలు మొదలయ్యాయి. చాదర్ ఘాట్ తదితర ప్రాంతాల్లో అధికారులు సుమారు 200 కూల్చి వేశారు. ఇటీవల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ఇళ్లను గుర్తించి వాటిపై RB-X అని పెద్ద అక్షరాలతో పెయింట్ .....(తరువాయి2లో)


## తాట తీస్తా..

### తాటాకు చప్పుళ్లకు భయపడం..



- మూసీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ బహాబహీ..
- రోజురోజుకు ముదురుతున్న జగడం..
- బాధితుల పరామర్శకు గులాబీ.., అడ్డుకున్న హస్తం..
- ఇరు వర్గాల మధ్య హోరాహోరీ..
- మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయిపై రాళ్ల దాడి

తాటాకు చప్పుళ్లకు భయపడే బాపతు కాదు. తాట తీసే వరకు వదిలిపెట్టే బాపతు అంతకన్నా కాదు. తొక్కాలని చూసిన నీ గుండాలా పైశాచికంతో ఇంకా బలం పెరిగింది. ఉద్యమంలో పిడికిలెత్తిన చరిత్ర నాది., ఉత్తపుణ్యానికి సీఎం అయిన హిస్టరీ నీది. బుల్డోజర్లు వస్తే పడుకోనైనా అడ్డుకుంటాం.., పేదోరి ఇంటిపై ప్రతికారం తీర్చుకుంటానంటే ప్రాణాలడ్డేసైనా ప్రతిఘటిస్తాం. జాగ్రత్త.., కడుపు మంటతో పెట్టుకోకు., కాలగర్భంలో కలిసిపోతావ్., చరిత్ర నుంచి కూడా తొలగిపోతావ్. .... మూసీ వేదికగా సీఎంకు బీఆర్ఎస్ వార్నింగ్



**జనపదం, బ్యూరో:** రాష్ట్రంలో మూసీపై యుద్ధం సాగుతోంది. అధికార, విపక్ష పార్టీల మధ్య లొల్లి రోజురోజుకు తీవ్రతరం అవుతోంది. సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాజకీయ వాతావరణం హీటెక్కుతోంది. ఈ అంశం ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ప్రధాన సమరంగా మారింది. మూసీ సుందరీకరణ కోసం మూసీ చుట్టూ ఉన్న అక్రమ కట్టడాలను ప్రభుత్వం కూల్చివేస్తుండగా, బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బాధితుల పక్షాన అండగా ఉంటోంది. వారితో కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నది. ......(తరువాయి 4లో)



## రాహుల్ జీ ఇదేనా ప్రేమ దుకాణం..?

దాడులు చేయడమే ప్రజాపాలనా..? కాంగ్రెస్ నేతకు హరీష్ సూటి ప్రశ్నలు.. కేటీఆర్ పై దాడికి తీవ్ర ఖండన.. సీఎంకు మీరిచ్చే సలహాలివా.. అని నిలదీత..

4



# హైడ్రా పొడ్సిందేంటి...?

### ఇప్పుడు నిమ్మలమైందా..?

### నాశనం చేసేదాక నిద్రపట్టలేదా..?

### ఎందుకు గోక్కున్నట్టు..

### కలుపుకుని పోకుంటే దూల తీరుద్దని తెల్వదా..

## సీనియర్లంటే లెక్కలేదా..?

- హైడ్రా.. ఆలోచన వెనకేముంది..
- ప్రజల్లో వ్యతిరేకత కనిపించడం లేదా...?
- పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం క్రియేట్ చేశారు..
- ఇతర రాష్ట్రాల్లో ప్రభావం పడే అవకాశం ఉంది..
- సీఎం రేవంత్ కు తలంటిని అధిష్టానం..
- కూల్చివేతల విషయమై ఆగ్రహం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ..

కూల్చడంలో ఉన్న ఆనందం కుక్క తిట్లు పడేలా చేసింది. నేలమట్టం చేయడంలోని పైశాచికం మెడలు వంచి నిలబడేలా మార్చింది. ఏదో పొడుస్తానని మొదలు పెట్టిన హైడ్రా మొదటికే మోసం చేసింది. కాచుకుని కూర్చున్న కళ్లకు ఎన్నో అవకాశాలను, మూసుకపోయిన పెదాలకు మరెన్నో పదాలను అందించేలా చేసిన అతి విన్యాసం ఇప్పుడు అధిష్టానంతో దొబ్బులు పడేలా చేసింది. రాష్ట్రమంతా కలకలం రేపుతున్న కూల్చివేతల ఎపిసోడ్ ఢిల్లీకి వెళ్లడంతో రేవంత్ కు తలంటిపోశారు. పెద్దల పిలుపుతో హుటాహుటీనా హస్తినాకు వెళ్లిన సీఎం ఏం చెప్పలేక, చెప్పింది వారికి నచ్చక, ఇప్పటికే సీనియర్లు చెప్పిన దాంతో అటు కక్కలేక, ఇటు మింగలేక అన్నట్టుగా దోషిగా నిలబడాల్సిన దుస్థితి దాపురించింది. ఇన్నాళ్లు మాంచి ఊపుమీదున్న రేవంత్ కు రాహుల్ చీవాట్లు బహుమానంగా దక్కాయి. దూకుడు తగ్గించుకుని పార్టీని నాశనం చేసే పనులకు చరమగీతం పాడాలనే ఉపదేశాలు అనుభవంలోకి వచ్చాయి.

**జనపదం, బ్యూరో**

గోక్కోవడం ఎందుకు.., బాధపడడం దేనికి..? అసలు పార్టీని ఏం చేద్దామని నీ ఉద్దేశం. జనాల్ని ఉద్ధరించడానికి నువ్వే ఉన్నవా..? సీనియర్లంటే పట్టింపులేదు., సలహాలు చెబితే వినే ఓపిక ఉండదు..? ఏదో పొద్దవని అనుకుంటే, మొత్తం పెంటపెంట చేశావ్. పార్టీ ఇప్పుడిప్పుడే పట్టుసాధిస్తున్నది సంబురపడుతాంటే, తెలివి తక్కువ పనులతో నాశనం చేశావ్. డీలాపడిన ప్రతిపక్షాలకు హైడ్రాతో బూస్ట్ ఇచ్చి, రాష్ట్రంలో మళ్లీ ఇబ్బందులు పెంచావ్. మొన్నటి దాకా మంచిగానే ఉన్నావ్ కదా.. ఇప్పుడేమైంది.? పూర్తిగా నిన్ను నమ్మడం మేం చేసిన తప్పా, లేదంటే కావాలనే ఇదంతా చేస్తున్నావని అనుమాన పడాల్నా..? ఇప్పటికైనా ఒళ్లు జాగ్రత్తగా, పనుల్లో అప్రమత్తంగా ఉంటేనే మంచిది. లేదంటే ఊహించనవి ఎదుర్కోవాల్సి వస్తుంది. రేవంత్ కు ఢిల్లీలో జరిగిన అనుభవ సారం ఇది.

**హైకమాండ్ ఫైర్..**

హైడ్రాపై రాష్ట్రమంతా కుతకుత ఉడుకుతున్న సమయంలో ఢిల్లీ నుంచి రేవంత్ కు అర్జంట్ పిలుపొచ్చిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం రాత్రికి రాత్రే ఆయన హస్తినాకు వెళ్లిపోయారు. రాష్ట్రంలో సీఎం చేపట్టిన సంస్కరణలు, కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత అన్ని విషయాలు పెద్దలంతా ఆరా తీశారు. ఇప్పటికే రాష్ట్రంలోని సీనియర్ మంత్రులు, పార్టీ పెద్దలు ఇక్కడ జరుగుతున్న ప్రతిదీ పిన్ టు పిన్ చేరవేస్తుండడంతో అన్నింటినీ బేరీజు వేసుకున్న పార్టీ పెద్దలు ఒక్కో విషయంపై స్పష్టంగా వివరాలు లాగేందుకు సమయం వెచ్చించారు. ఈ క్రమంలోనే ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పై రాహుల్ గాంధీ, పార్టీ హైకమాండ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

**నేను వ్యతిరేకిస్తా.. నువ్వేం చేస్తూ పో..**

ఇబ్బడిముబ్బడి కూల్చివేతలపై నేనేమో బీజేపీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తుంటే నువ్వేమో అదే పనిచేస్తూ పార్టీ .......(తరువాయి2లో)

## అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ..

### మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

### ఆడపడుచులకు పండుగ శుభాకాంక్షలు..

### సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్ష..

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణ అస్తిత్వానికీ, సాంస్కృతిక జీవనానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని, పూలను దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ ప్రపంచ సంస్కృతీ సంప్రదాయాల్లోనే ప్రత్యేకతను చాటుకుందన్నారు. తరతరాలుగా మహిళా సామూహిక శక్తికి, ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ, తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని కేసీఆర్ గుర్తు చేశారు. ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దులతో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ సందర్భంగా పల్లెలు పట్టణాలు భేదం లేకుండా మహిళలు, పిల్లా పాపలతో ప్రత్యేక సందడి నెలకొంటుందన్నారు. బతుకమ్మ పండుగ విశిష్టతను గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. మహిళల ప్రత్యేక పండుగగా గుర్తించి బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక కానుకలను అందజేసిన విషయాన్ని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను ఆటా పాటలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని తెలంగాణ ఆడబిడ్డలను కోరారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రకృతి మాత బతుకమ్మ వెలుగులు నింపాలని మన స్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్టు చెప్పారు.



## ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమా..?

- మూసీ ప్రక్షాళన అంతా కోరుతున్నారు..
- ప్రజలను రెచ్చగొట్టడం సరికాదు..
- అవసరమైతే ప్రజలతో తిరుగుబాటు చేయిస్తాం..
- విపక్షాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరిక..

4





## రేవంత్... శవాలపై పైసలు ఏరుకో..

హోంగార్డులంటే అంత చులకనా..?

గోపాల్ కుటుంబాన్ని సర్కారే ఆదుకోవాలి..

మాజీ మంత్రి హరీష్ రావు..

హైడ్రా పేరుతో హత్యలు చేస్తోందని రేవంత్‌పై మండిపాటు..

4

## సీఎం ఔట్...

### సీఎం ఇంటికెళ్లే సమయం వచ్చింది

- హైడ్రా పేరుతో రాష్ట్రాన్ని దోస్తున్నారు
- కప్పం కట్టేందుకే ఢిల్లీకి సీఎం
- మూసీ ప్రక్షాళన జేబులకే..
- రైతులను మోసం చేసిన ముఖ్య మంత్రిగా చరిత్రలో ఉంటారు
- బీజేపీ రైతుల పక్షపాతి
- హైడ్రాను బంద్ పెట్టే రోజు త్వరలోనే వస్తుంది
- రైతు దీక్షలో బీజేపీ నేతలు

4





మొక్కు చెల్లింపు...

లడ్డూ కల్తీ నేపథ్యంలో ప్రాయశ్చిత దీక్ష స్వీకరించిన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ మంగళవారం కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. అలిపిరి మెట్ల మార్గంలో ఆయన నడిచారు. కాలునొప్పి కారణంగా తీవ్ర ఇబ్బందిపడ్డ పవన్ మార్గమధ్యలో పలుమార్లు మెట్లపైనే విశ్రాంతి తీసుకున్నారు.



## సిట్ దర్యాప్తు నిలిపివేత..

### తిరుమల కల్తీ నెయ్యి ఘటనపై ఏపీ డీజీపీ వెల్లడి..

తిరుమలలో కల్తీ నెయ్యి ఘటనపై సిట్ దర్యాప్తు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఈ కేసు విచారణ సుప్రీంకోర్టులో సాగుతున్న దృష్ట్యా, రాష్ట్ర న్యాయవాదుల సూచనల మేరకు దర్యాప్తు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగానే సిట్ దర్యాప్తు కొనసాగుతుందని డీజీపీ వెల్లడించారు. - జనపదం, అమరావతి

## పంటె పీకేసుడే..

- నోర్లు తెరవండి.. వాగ్దాటి పెంచండి...
- ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కోండి..
- పదవులు రాగానే సాధించామనుకుంటే సరిపోదు..
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- కార్పొరేషన్ చైర్మన్లతో సమావేశం..
- హైడ్రా, మూసీ పై విపక్షాల అసత్య ప్రచారాన్ని ఎండగట్టాలని పిలుపు..



**జనపదం, హైదరాబాద్ సిటీ:**

నామినేటెడ్ రాగానే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని, పదవులు రాగానే కార్యకర్తలను, ప్రజలను విస్మరించే పద్ధతి మంచిది కాదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఇటీవల నియమితులైన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో మంగళవారం గాంధీభవన్ లో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పదవుల్లో కొనసాగాలన్నా, ఇంకా పెద్ద పదవుల్లో ఉండాలన్నా పార్టీని బలోపేతం చేసే దిశగా పని చేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే రీతిలో పదవులను అడ్డం పెట్టుకొని ఎలాంటి కార్యక్రమాలు చేసినా ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తెలిపారు. ...(తరువాయి2లో)



## ప్రభుత్వంతో కొట్లాడుతా..

- ప్రశాంతంగా పడుకోండి..
- మీ ఇంటి మీదకు ఎవ్వరూ రారు..
- మూసీ బాధితుల వద్ద మధుయాష్కి గౌడ్ సంచలన ప్రకటన

4


J A N A P A D H A M

Read Share Follow janapadam @janapadam #janapadam

# సర్కారుకు మూసీ కంపు

- అంతా ఆగమాగం.. అయోమయం
- 'మూసీ'లో అసలేం ఏం జరుగుతోంది
- ఇప్పటికే కోర్టుకెక్కిన వివాదం
- మరోవైపు విపక్షాలకు పదునైన ఆయుధం
- సొంత పార్టీలోనే సర్కారుకు తలనొప్పులు



**జనపదం, బ్యూరో:** మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ సర్కారు ఉచ్చులో చిక్కుకున్నది. మొన్నటిదాకా సైలెంట్‌గా ఉన్న విపక్షాలకు హైడ్రా రూపంలో పదునైన ఆయుధాన్ని కూడా అందించింది. ఇప్పుడూ మూసీని ముట్టుకొని వేలాడుతున్న ప్రభుత్వానికి.. బాధితుల రూపంలో సెగ అంటుతోంది. అసలు మూసీ పరివాహక ప్రాంతంలో ప్రభుత్వం ఏం చేయబోతోంది..? ఇందు కోసం ఎంత మేర భూసేకరణ చేస్తారు? బాధితులకు పరిహారం పెంచుతారా? పెంచితే ఏ ప్రాతిపదికన పెంచుతారు? అసలు కూల్చేది హైడ్రానా? జీహెచ్ఎంసీనా? అన్న అంశంపై తీవ్ర గందరగోళం నెలకొంది.

## సర్కార్ కు తలనొప్పి..

మూసీ పరివాహక ప్రాంతంలో కూల్చివేతల అంశం రేవంత్ సర్కార్ కు తలనొప్పిగా మారింది. ఓ వైపు బాధితుల ఆందోళనలు, మరో వైపు ప్రతిపక్షాల నిరసనలు, ఇంకో వైపు హైకోర్టులో విచారణతో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై ప్రభుత్వం ఆలోచనలో పడింది. అయితే.. ప్రభుత్వం చెబుతున్న దానికి క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి పొంతన లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్న చర్చ సాగుతోంది. సామరస్యపూర్వకంగా నిర్వాసితులను ఒప్పించిన తర్వాతనే కూల్చివేతలు ఉంటాయని అధికారులు చెబుతుండగా.. క్షేత్ర స్థాయిలో మార్కింగ్ కు వెళ్లిన సిబ్బంది మాత్రం అత్యుత్సాహం ప్రదర్శించారన్న వార్తలు వస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో కూల్చివేతలు ఉంటాయన్నట్లుగా వారు ప్రవర్తించారన్న ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఆందోళనకు ఇదే కారణమని తెలుస్తోంది.

## అసలేం చేస్తారు?

మరో వైపు ప్రభుత్వం కూడా తాము మూసీ చుట్టూ ఏం చేయబోతుందనే అంశంపై క్లారిటీ ఇవ్వకపోవడంపై భారీగా విమర్శలు వస్తున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ద్వారా ఏఏ కార్యక్రమాలను చేపడుతారు? ఎలాంటి నిర్మాణాలు చేస్తారు? మూసీకి ఇరు వైపులా ఎంత వరకు నిర్మాణాలను తొలగిస్తారు? ఆ అభివృద్ధిలో నిర్వాసితులకు ఏమైనా భాగస్వామ్యం కల్పిస్తారా? అన్న అంశంపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాలేదు. మూసీ అభివృద్ధికి సంబంధించి ఎలాంటి డీపీఆర్ ను సైతం ఇప్పటివరకు విడుదల చేయలేదు. ఇవన్నీ గందరగోళానికి దారి తీశాయన్న చర్చ సాగుతోంది.

## కూల్చివేతలు చేసేదెవరు?

మొన్నటి వరకు మూసీ పరివాహక ప్రాంతంలో కూల్చివేతలను హైడ్రాకు అప్పగించారన్న ప్రచారం జోరుగా సాగింది. ఇందుకు సైతం పెద్దపెద్ద మిషన్లను సైతం హైడ్రా అధికారులు సమకూర్చుకుంటున్నారన్న వార్తలు వచ్చాయి. మీడియా, సోషల్ మీడియా కథనాలు, ప్రతిపక్షాల విమర్శలు అన్నీ హైడ్రా చుట్టూనే సాగాయి. కానీ నిన్న సడన్ గా హైడ్రా విడుదల చేసిన ప్రకటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. మూసీ కూల్చివేతలకు తమకు ఎలాంటి సంబంధం లేదని హైడ్రా కమిషనర్ పేరు మీద ప్రకటన రావడంపై జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా ఉందన్న అభిప్రాయం హైడ్రా ప్రకటనతో వ్యక్తం అవుతోంది.

## పరిహారం ఎంత..? ఎలా?

మూసీ పరివాహక ప్రాంతాల్లో మూడు రకాల నిర్మాణలు ఉన్నాయి. మూసీ రివర్ బెడ్, బఫర్, ఎఫ్టీఎల్ ఇలా మూడు ప్రాంతాల్లో నిర్మాణాలను తొలగిస్తారన్న ప్రచారం సాగుతోంది. అయితే.. ఇందులో మూసీ రివర్ బెడ్ లో నిర్మించుకున్న వారిలో మెజార్టీ కుటుంబాలు ప్రభుత్వం అందించే డబుల్ బెడ్రూం ఇళ్లలోకి వెళ్లేందుకు రెడీగా ఉన్నాయి. మరికొందరు మాత్రం తాము వెళ్లమని స్పష్టం చేస్తున్నారు. వీరి విషయం పక్కన పెడితే.. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేసుకున్న వారికి పరిహారం ఎలా ఇస్తారనే అంశంపై ప్రభుత్వం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. వీరంతా స్థలాలు కొనుక్కుని, ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులతో నిర్మాణాలు చేసుకున్నారు. దీంతో తాము కష్టపడి కట్టుకున్న ఇళ్లను వదిలి వెళ్లడానికి వారు ససేమిరా అంటున్నారు. ప్రభుత్వం తీరుపై వీరు భగ్గుమంటున్నారు.

## బ్యాంక్ లోన్ల పరిస్థితి ఏంటి?

ఇప్పటి వరకు ఇక్కడ ఒకో ఇల్లు ధర రూ.50 లక్షల నుంచి కోట్ల వరకు కూడా పలికింది. అనేక మందికి బ్యాంక్ లు లోన్లు కూడా ఇచ్చాయి. అయితే.. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామంటే వీరు ఖాళీ చేసే పరిస్థితి కనిపించడం లేదు. వీరికి పరిహారం పెంచే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. అయితే.. ఎంత పెంచుతారు..? ఏ ప్రాతిపదికన పెంచుతారు? బ్యాంక్ లోన్ల పరిస్థితి ఏంటి? అన్న అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదు.

# అడ్డం పడుదాం..

- పేదలకు పేదలే అండ.. బుల్డోజర్లను రానివద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**జనపదం, హైదరాబాద్ సిటీ:** మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సర్వే, కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇండ్లు కూల్చుతారోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక పరిధి తులసీరామ్ నగర్‌లో మూసీ ప్రాంత వాసులను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారన్నారు. గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరని, వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. మూసీమే లూటో.. ఢిల్లీ మే బాంటో అనేది కాంగ్రెస్ నినాదమని విమర్శించారు. మీ ఇండ్ల మీదకు బుల్డోజర్ వస్తే కంటె అడ్డుపెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కాదు.. ఆయన తాత వచ్చినా ఏమీ చేయలేరన్నారు.

## కేంద్ర మంత్రి అడ్రస్ ఎక్కడా..?

రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని కేటీఆర్ ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడతామంటూ కూల్చుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడపలుక్కున్నారా? అని అడిగారు. పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే దేవుడని అన్నారు. రేవంత్ రెడ్డి మొగోడివైతే ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మన హక్కులను లాక్కునే హక్కు ఎవరికీ లేదని, మీకోసం బీఆర్ఎస్ తరపున కోర్టులో కొట్లాడుతామని బాధితులకు భరోసానిచ్చారు.

# పంటె పీకేసుడే..

(మొదటిపేజీ తరువాయి) ప్రభుత్వంపై, కాంగ్రెస్ పై ప్రతిపక్షాలు చేసే విమర్శలను చైర్మన్లుగా గట్టి కౌంటర్ ఇవ్వాలని, పదవులు రాగానే పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు లో తగిన మూల్యం చెల్లించుకుంటారని వారిని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా, మూసీ ప్రక్షాళన విషయంలో బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అవిశ్రాంతంగా పని చేసిన మీరు కాంగ్రెస్ పాలనలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు కన్పిస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం, మంత్రులు రోజుకు విశ్రాంతి లేకుండా 18 గంటలు పని చేస్తున్నారన్నారు. రోజుకొక కొత్త స్కీంను తీసుకొచ్చి ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. కానీ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం సోషల్ మీడియాలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రుల పట్ల ప్రజల్లో గందరగోళానికి దారితీస్తుందని పీసీసీ చీఫ్ సూచించారు. అందుకు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని ప్రచారం చేయాలని, ప్రతిపక్షాల విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. ఇప్పటివరకు దేశంలో ఏ రాష్ట్రమూ అంత పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదని ఆ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఇంకా దూకుడుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

## తీర్మానం..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే డీసీసీ అధ్యక్షులకు, ఫ్రంటల్ చైర్మన్ లకు, సీనియర్ నాయకులకు అందరిని గుర్తించి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చినందుకు కాంగ్రెస్ అధిష్టానానికి, సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

# మళ్లీ కూల్చివేతలు..

(మొదటిపేజీ తరువాయి) వేసిన విషయం తెలిసిందే. అయితే తమ ఇళ్లను కూల్చివేస్తారంటూ ఆందోళన చెందిన స్థానిక ప్రజలను అధికారులపై తిరగబడడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ పలువురు స్థానికులు ఆందోళనకు దిగారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చివరకు భారీ పోలీసులు భద్రత నడుమ రెవెన్యూ అధికారులు ఇళ్లపై RB-X అంటూ మార్క్ వేశారు. ప్రస్తుతం మరికొన్ని ప్రాంతాల్లో కూడా మార్క్ సర్వే ను అధికారులు కొనసాగిస్తున్నారు. పోలీసు భద్రత మధ్యే ఈ సర్వే సాగుతోంది. కూల్చివేయాల్సిన ఇళ్లకు అధికారులు మార్క్ వేస్తున్నారు. అక్కడి ప్రజలు ఇళ్లు ఖాళీ చేసిన వెంటనే అధికారులు ఆ ఇళ్లను కూల్చివేయనున్నారు.

## 16 వేల నివాసాలు..

మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ ను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణకు శ్రీకారం చుట్టింది. అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఉన్నట్లు తేలింది. అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి గుర్తించి ఇళ్లపై రాశారు.



## శంకర్ పల్లిలో స్వచ్ఛందంగా కదలిక..

మూసీ పరివాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు మొదలయ్యాయి. ఆ నదిని ఆక్రమించుకుని నిర్మించుకున్న నివాసాలు, దుకాణాలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం కూల్చివేతలు ప్రారంభించారు. మలక్ పేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని శంకర్ నగర్ లో ఉదయం కూల్చివేతలకు వెళ్లిన అధికారులకు వింత అనుభవం ఎదురైంది. ఈ కూల్చివేతలు స్వచ్ఛందంగా సహకరించిన ప్రజలు తమ నివాసాలు ఖాళీ చేసి అక్కడ్నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ ప్రాంతంలో బుల్డోజర్లు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో అధికారులు కూలీలతో కూల్చివేతలు చేపడుతున్నారు. ఈ నిర్వాసితులను ఇప్పటికే చంచల్ గూడలోని పిల్లిగుడిసెల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి తరలించారు. మరికొంతమంది నిర్వాసితులను తరలించేందుకు, ఇళ్లల్లోని సామగ్రి తీసుకెళ్లేందుకు అధికారులు వాహనాలు ఏర్పాటు చేశారు. కాగా మూసీ సుందరీకరణ పనుల్లో భాగంగా రివర్ బెడ్ పరిధిలో దాదాపు 55 కిలోమీటర్ల పరిధిలో ఆక్రమణలను గుర్తించిన జీహెచ్ఎంసీ అధికారులు వాటికి మార్కింగ్ వేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇప్పుడు దశలవారీగా కూల్చివేతల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

# రాష్ట్రానికి కేంద్రం మొండిచెయ్యి

- బడ్జెట్ లోనూ గుండు సున్నా..
- 8 మంది ఎంపీలనిచ్చినా ఒరిగిందేమీ లేదు..
- ఎన్డీఆర్ఎఫ్ నిధుల్లో ఏపీ కన్న మనకు తక్కువే
- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శ

**జనపదం, సిద్దిపేట:** వరద ప్రభావిత రాష్ట్రాలకు విడుదల చేసిన నిధుల్లో జరిగిన అన్యాయం తీవ్ర దుమారం రేపింది. బీజేపీ–బీఆర్ఎస్ మధ్య వివాదం రాజుకుంది. విడుదలైన నిధులపై రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రశంసలు కురిపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు చెప్పగా.. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు మాత్రం తీవ్ర విమర్శలు చేశారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు విడుదలైన వాటిలో సగం కూడా రాలేదని మండిపడ్డారు. జాతీయ విపత్తుల నిధులను అడ్వాన్స్‌గా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.416.80 కోట్లు విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వం వద్ద ఇప్పటికే రూ.1,345 కోట్లకు యుటిలైజేషన్ సర్టిఫికేట్ ఇస్తే మిగిలిన నిధులను విడుదల చేసేందుకు సిద్ధమని సెప్టెంబర్ 3వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం లేఖ రాసింది. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరానికి గాను మొదటి, రెండో విడత ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను విడుదల చేసింది. ఈ ఏడాది జూన్‌లో రూ.208.40 కోట్లను తెలంగాణకు వచ్చాయి. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలకు రూ.4343 కోట్లను విడుదల చేయడంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు.

## హరీశ్ రావు విమర్శలు

విడుదలైన నిధులు చూస్తే పక్క రాష్ట్రం ఏపీలో సగం కూడా రాలేదని మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఇప్పుడు వరద సహాయ నిధుల్లో కూడా తెలంగాణకు తీవ్ర అన్యాయం చేయడంతో బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇదే విషయమై గులాబీ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై.. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులపై ఫైర్ అయ్యారు. 'తెలంగాణ బీజేపీకి 8 ఎంపీ సీట్లు ఇస్తే రాష్ట్రానికి ఒరిగింది ఏమిటి..? కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు గుండు సున్నా అని, స్టేట్ స్పెసిఫిక్ గ్రాంట్లలో తెలంగాణకు మొండిచెయ్యి. ఎన్డీఆర్ఎఫ్ నిధుల కేటయింపుల్లో తెలంగాణకు అంధ్రతో పోలిస్తే సగం కంటే తక్కువ కేటాయింపులు. ఇదే నా సబ్ కా సాథ్ సబ్ గా వికాస్..?' అని హరీశ్ రావు 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.



# అక్కకు తమ్ముడిగా నూలు దండ వేశా..

- అక్కకు మద్దతుగా నింది తుడిని కోర్టుకు ఇడుస్తా..
- కేటీఆర్, హరీశ్ రావు క్షమాపణ చెప్పాలి
- ఎంపీ రఘునందన్ రావు

**జనపదం, బ్యూరో:** బీఆర్ఎస్ సోషల్ మీడియా తల్లి, అక్క, చెల్లి మధ్య ఉండే సంబంధం తెలియకుండా సంస్కారహీనంగా పోస్టులు పెట్టిందని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా కొండా సురేఖ తొలిసారి దుబ్బాకకు కల్యాణ్ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి వచ్చినందుకు ఒక అక్కకు తమ్ముడిగా ఆమెను అడిగి మరీ నూలు పోగు దండ వేసినట్లు చెప్పారు. అలాంటి నూలు పోగు దండను ప్రధాని మోడీ వచ్చినప్పుడు కూడా వేశానని గుర్తు చేశారు. అక్కకు జరిగిన అవమానానికి తమ్ముడిగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానని రఘునందన్ రావు అన్నారు. అక్కకు మద్దతుగా ఒక వకీలుగా పోస్టులు పెట్టిన వారిని కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. పోస్టు పెట్టిన అకౌంట్‌కు హరీశ్ రావు, కేసీఆర్ ఫొటో ఉందన్నారు. బీఆర్ఎస్‌కు సోషల్ మీడియా మీద నియంత్రణ లేదని విమర్శించారు. పోస్టులు పెట్టిన వారు మీ వాళ్లు అయితే తీసుకొచ్చి పోలీసులకు అప్పగించండని డిమాండ్ చేశారు. మీకు సంబంధం లేని, మీరు జీతం ఇవ్వని వ్యక్తులు అయితే వచ్చి మీరు కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును ఉదేశిస్తూ అన్నారు



## క్షమాపణ చెప్పాలి

కేటీఆర్, హరీశ్‌రావు మంత్రి కొండా సురేఖ ఘటనపై స్పందించి సోషల్ మీడియాను కంట్రోల్ చేసుకుని క్షమాపణ చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. వ్యక్తుల వ్యక్తిత్వ హననం చేయడం మంచిది కాదని సూచించారు. మహిళల మీద బీఆర్ఎస్‌కు గౌరవం లేదన్నారు. తెలంగాణ తొలి కేబినెట్‌లో మహిళలకు చోటు ఇవ్వలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచే డబ్బుల తీసుకున్న వారు ఇలాంటి ట్రోలింగ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలే ట్రోలింగ్ చేశారని ఆరోపించారు.

# హైడ్రా పొడ్సిందేంటి...?

(మొదటిపేజీ తరువాయి) పరువు తీసెయ్ అని రాహుల్ గరంగానే నిలదీశారు. హైదరాబాద్ అంటే ఇప్పుడు దేశమంతా హైడ్రా అనే గుర్తుకొచ్చేలా చేశావని, ఎందుకు ఇలాంటి తెలివిమాలిన పనికి శ్రీకారం చుట్టావని ఒక సందర్భంలో ఆవేశంతో నిలదీసినట్టు సమాచారం. అసలు కూల్చాలనే ఆలోచన ఎందుకు చేసినట్టు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పెద్దలంటే లెక్కలేదా..?

ఎంతో సీనియారిటీ ఉన్న పార్టీలో పెద్దలెందరో సలహాలు, సూచనలు చేయడానికి సిద్ధంగా ఉన్నారనే విషయం మర్చిపోతే ఎలా అని రాహుల్ ప్రశ్నించారు. ఈ విషయమై పెద్దలంటే లెక్కలేదా., లేదంటే వాళ్లు చెబితే వినేదేంటనే పొగరా.. అనే రీతిలో కూడా మందలించినట్టు సమాచారం. యోధానయోధులున్నా బాధ్యతలు అప్పగించినందుకు సరైన గుణపాఠమే చెప్పావ్ అనే రీతిలో తలంటారు. పార్టీ సీనియర్ల సలహాలు తీసుకోకుండా ఒంటెత్తు పోకడగా వెళ్లడం సరికాదని, మరోమారు ఇలాంటివిజరగకుండా చూసుకోవాలని మందలించారు.

## కేసీ వేణుగోపాల్‌కు రాహుల్ ఫోన్..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మార్గదర్శకత్వం చేయాలని రాహుల్ గాంధీ అప్పటికప్పుడు కేసీ వేణుగోపాల్‌కు ఫోన్ లో ఆదేశించారు. రాష్ట్రంలో పార్టీకి జరుగుతున్న డ్యామేజ్ ను నిలువరించేలా గైడ్ చేయాలని కోరారు. దీంతో అప్పటికప్పుడు సీఎం రేవంత్ ఢిల్లీలో కేసీ వేణుగోపాల్ తో భేటీ అయ్యారు. ఇద్దరి మధ్య చాలా వాడివేడిగా చర్చ జరిగినట్టు సమాచారం. ప్రజల మానసిక స్థితి, ప్రతిపక్షాల చేస్తున్న ఆందోళనలు, పార్టీలో సీనియర్లు ఇప్పటికే పాలనా వ్యవహారాలపై చేసిన ఫిర్యాదులన్నీ ఇద్దరూ చర్చించారు.

## ఇతర రాష్ట్రాల్లో ప్రభావం..

సీనియర్లు చేసిన ఫిర్యాదులపై ప్రధాన చర్చ సాగింది. ఈ క్రమంలో మీరు చేస్తున్న పనులతో పార్టీకి ఇతర రాష్ట్రాల్లోచెడ్డపేరు వచ్చే ప్రమాదం దాపురించిందని ఆగ్రహించారు. సొంత ఆలోచనలుచ, స్వకార్యంతో పార్టీకి ఇబ్బందులు కలిగించొద్దని వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ అంటే నీ ఒక్కడిదే కాదుకదా., దేశమంతా పరిశీలిస్తుందనే విచక్షణ కూడా మరిస్తే ఎలా అని చురకలంటించారు. హైకమాండ్ఆదేశాలు బేఖాతరు చేస్తే భవిష్యత్ లో ఇబ్బందులు తప్పవని, ఒక్కరిద్దరి చేష్టలతో పార్టీ పరువు పోతుందని తెలిస్తే ఎలాంటి నిర్ణయానికైనా వెనకాడేది ఉండదని హెచ్చరించారు. పార్టీలో సీఎం అయినా, సామాన్య కార్యకర్త అయినా సరే అధిష్టానం, పార్టీ పెద్దల ఆదే శాలు తూచ తప్పకుండా పాటించాల్సిందే అని వార్నింగ్ ఇచ్చారు. ఏది ఏమైనా సీఎం రేవంత్ కు హైడ్రా అధిష్టానం నుంచి విపరీతమైన తలంటిపోతను మిగిల్చింది. ఇంకా ముమ్ముందు ఏమేం పరిణామాలకు దారి తీస్తుందో చూడాలి మరి..

# హైడ్రా మిస్ ఫైర్..

- దానిపై సర్కార్ వైఖరి చెప్పాలి..
- ఆక్రమణలపై శ్వేత పత్రం ప్రకటించాలి
- జీవో 58,59 ప్రకారం ఇండ్లు క్రమబద్ధీకరించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని


**జనపదం, హనుమకొండ:** హైడ్రా పై ప్రజలు భయాందోళనలకు గురవుతున్నందున దాని పరిధి, పరిమితి పై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైడ్రా మొదట ఎన్ కన్వెన్షన్ కూల్చివేసినప్పుడు ప్రజామోదం లభించిందని, కానీ పేదల ఇండ్లు కూల్చిన తరువాత వారి హృదయ విదారక సన్నివేశాల తరువాత అభిప్రాయం మారిందన్నారు. హైడ్రా మిస్ ఫైర్ అయినట్లు కనిపిస్తున్నదని, దానిని విధ్వంసానికి కాకుండా అభివృద్ధికి, వికాసానికి వినియోగించాలని సూచించారు. రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయో, ఎక్కడ ఆక్రమణలు జరిగాయో శ్వేత పత్రం ప్రకటించాలన్నారు. కొందరు పెద్దలు వాటిని ఆక్రమించి విల్లాలు, ఫామ్ హౌస్ లు, కన్వెన్షన్ లు నిర్మిస్తే మరికొన్ని



చోట్ల పేదలు అన్ని అనుమతులు తీసుకుని ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని చెప్పారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మూసీ ఆక్రమణలు హైడ్రా పరిధిలోకి రావని చెప్పడం సంతోషమేనని, అలాగే హైకోర్టు పేదల ఇండ్ల కూల్చివేతలపై చేసిన వ్యాఖ్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ప్రజలలో ఉన్న భయాందోళనలను తొలగించాలని కోరారు. పేదలకు జీవో 58,59 ప్రకారం ఇండ్లు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. హైడ్రా ను హైదరాబాద్ కే పరిమితం చేయాలని,జిల్లాలకు తేవద్దని హితవు పలికారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నల్ల చట్టాలు తెచ్చిన బీజేపీ నాయకులు కూడా రుణ మాఫీ చేయాలని దొంగ దీక్షలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ కార్యదర్శి సిరబోయిన కర్నాకర్, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, వేల్పుల సారంగపాణి, ఏశబోయిన శ్రీనివాస్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా జీవో 99 చట్టబద్ధతను సవాల్ చేస్తూ పిటిషన్

### మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు



**జనపదం, క్రైం:** హైడ్రాను ఏర్పాటు చేస్తూ ఇచ్చిన జీవో 99పై ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసేదాకా జీవో అమలును నిలిపిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. హైడ్రా ఏర్పాటుపై కౌంటరు దాఖలు చేసిన తరువాత ఒకేసారి పిటిషన్‌పై విచారణను చేపట్టి నిర్ణయాన్ని వెలువరిస్తామని పేర్కొంది. ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేస్తూ తీసుకువచ్చి జీవో 99 చట్టబద్ధతను సవాలు చేస్తూ హైదరాబాద్ నానక్‌రాంగూడకు చెందిన లక్ష్మి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరపున కౌంటరు దాఖలు చేస్తామని, దీనికి కొంత గడువు కావాలని అదనపు అడ్వకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి కోరారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ జీవో అమలును నిలిపిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్లో 10.24 ఎకరాల్లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి జీవో 99కు సంబంధించి ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని, ప్రభుత్వం కౌంటరు దాఖలు చేశాక విచారణ చేపడతామంటూ విచారణను ఈనెల 15కు వాయిదా వేశారు.


# ముగిసిన జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు..

**జనపదం, బ్యూరో:** జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తుది విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జమ్ము ప్రాంతంలో 24, కశ్మీర్ లోయలో 16 కలిపి మొత్తం 40 స్థానాలకు ఎన్నికలు జరుగాయి. బరిలో 415 మంది అభ్యర్థులు ఉండగా.. 39.18 లక్షల మంది ఓట్లు వేశారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఉపముఖ్యమంత్రులు తారా చంద్, ముజఫర్ బెయిగ్ కూడా ఉన్నారు.5,060 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిమిత్తం దాదాపు 20 వేల మంది సిబ్బంది విధులు నిర్వహించారు. 370 రాజ్యాంగ అధికరణం రద్దు తర్వాత ఓటుహక్కు పొందిన పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులు, వాల్మీకి సమాజ్, గూర్ఖా తెగలవారు ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశారు. ఓట్ల లెక్కింపు అక్టోబర్ 8న ఉంటుంది.

# సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు భారీ ఆపరేషన్

### 27 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్

**జనపదం, బ్యూరో:** రాజస్థాన్‌లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించారు. జయపుర, నాగౌర్, జోధ్‌పూర్, సైబర్ సెక్యూరిటీ పోలీసుల సోదాలు నిర్వహించారు. దాదాపు 20 రోజులపాటు సెక్యూరిటీ పోలీసుల ఆపరేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా 27 మంది సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి భారీగా బ్యాంక్ చెక్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 31 బ్యాంక్ చెక్‌బుక్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ సైబర్ ముఠాపై దేశవ్యాప్తంగా పలు సైబ్ నేరాలు నమోదయ్యాయి. తెలంగాణలో 189, దేశవ్యాప్తంగా 2,233 కేసులు రిజిస్టర్ అయ్యాయి. 29 నకిలీ ఖాతాల ద్వారా రూ.11.01కోట్లు ముఠా లూటీ చేసింది. నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 37 సిమ్‌కార్డులు పోలీసుల బృందం స్వాధీనం చేసుకున్నది. 13 ఏటీఎం కార్డులు, ఏడు చెక్‌బుక్, రెండు హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నది. తెలంగాణలో 189 కేసుల్లో రాజస్థాన్ ముఠా రూ.9కోట్లు లూటీ చేసింది. పోలీసుల నిఘా పెరగడంతో నగరాలు వదిలి ముఠాలు గ్రామాల వైపు దృష్టి పెట్టాయి. మారుమూల గ్రామాల్లో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు.



## సూపర్ స్టార్ రజనీకాంత్‌కు అస్వస్థత..

- చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స
- ఆరోగ్యం నిలకడగా ఉందన్న డాక్టర్లు

**జనపదం, బ్యూరో :** కడుపు నొప్పి కారణంగా 73 ఏళ్ల సూపర్ స్టార్ రజనీకాంత్ సోమవారం అర్ధరాత్రి చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. రజనీకాంత్ కొన్నాళ్ల క్రితం సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఇప్పుడు ఆయన కడుపులో నొప్పితో హాస్పటల్‌లో చేరడంతో అభిమానులు ఆందోళన పడుతున్నారు. కాగా ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలుపుతున్నారు. రజనీకాంత్‌కు రక్త నాళాల్లో ఇబ్బందులున్నట్లు గుర్తించామని, ఎలక్టీవ్ ప్రొసీజర్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, రెండు రోజుల్లో ఆయనను డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు చెప్పారు. రజనీకాంత్ కు అస్వస్థత అని తెలియగానే అభిమానులు ఆందోళన చెందారు. సోషల్ మీడియా వేదికగా ఆయన త్వరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థిస్తూ పోస్ట్ లు షేర్ చేశారు. అలాగే పలువురు ప్రముఖులు కూడా ఆయన ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు కనుక్కుంటున్నారు. కాగా జై భీమ్ సినిమా దర్శకుడు జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న వేట్టయాన్ చిత్రం అక్టోబర్ 10 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో సూపర్ స్టార్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా నటిస్తున్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

- ఒకరి పరిస్థితి విషమం

**జనపదం, కొత్తగూడెం :** ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్ లు ఢీ కొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన కొత్తగూడెం జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివారాలిలా ఉన్నాయి. కారేపల్లి మండలం భాగ్యనగర్ ఆంజనేయ స్వామి దేవాలయం బొద్రాస్ కుంట వద్ద మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు బలంగా ఢీకొన్నాయి. గుట్ట కింద గుంపునకు చెందిన దంపతులు ఉండం సూర్యనారాయణ (55) ఉండం సుగుణ(45) సోలార్ ప్లాంట్లో పనిచేస్తున్న ఇంజనీర్ వెంకటేష్ (36 ) ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఆలియా తండాకు చెందిన డీజే రాజుకు తీవ్రగాయాలయ్యాయని, ప్రస్తుతం అతడి పరిస్తితి విషమంగా ఉందని సమాచారం. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## బాలీవుడ్ నటుడు గోవిందాకు బుల్లెట్ గాయాలు

- ముంబైలోని ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స!

**జనపదం, బ్యూరో :** ప్రముఖ బాలీవుడ్ నటుడు గోవిందాకు బుల్లెట్ గాయాలయ్యాయి.. ఇంట్లో ప్రమాదవశాత్తు తుపాకీ పేలి గాయాలైనట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. మంగళవారం ఉదయం ముంబైలోని ఆయన ఇంటి నుంచి కోల్‌కతాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను తీసుకెళ్తుండగా అది చేతి నుంచి జారి కింద పడింది. దీంతో తుపాకీ పేలి కాలిలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. వెంటనే వైద్యులు చికిత్స అందించి బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నట్లు సమాచారం.

## తెలంగాణ తల్లి విగ్రహ ముసుగు కాల్చిన వ్యక్తి అరెస్ట్

- రిమాండ్ కు తరలించిన పోలీసులు



**జనపదం, సిద్దిపేట :** తెలంగాణ తల్లి విగ్రహ ముసుగును కాలబెట్టిన నిందితుడిని హుస్నాబాద్ అక్కన్నపేట పోలీసులు ఆరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. హుస్నాబాద్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అక్కన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌటపల్లి గ్రామంలోని బురుజు చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే అది ఇందకా ప్రారంభం కాలేదు. దీంతో విగ్రహానికి ముసుగు వేశారు. అయితే ఆదివారం విగ్రహానికి ఉన్న ముసుగును ఆదివారం రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కాలబెట్టాడని టీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఇందులో భాగంగా టెక్నాలజీని ఉపయోగించి తెలంగాణ తల్లి విగ్రహం ముసుగును అంటుపెట్టిన నిందితుడు అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన కామాద్రి రాంబాబుగా గుర్తించి, చాకచక్యంగా పట్టుకొని మంగళవారం అరెస్టు చేశామన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఊరుకునేది లేదని, వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు.

# పామ్ ఆయిల్ రైతులకు దసరా కానుక

- రూ. 17,043 కు పెరిగిన పామాయిల్ గెల ధర
- గతంలో గెలకు రూ. 14,392
- రాష్ట్ర రైతులకు రూ. 12 కోట్ల లబ్ధి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు





**జనపదం, బ్యూరో :** పామాయిల్ రైతులకు దసరా కానుక అందించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముడి పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ముడి పామాయిల్ గెలల ధర రూ.14,392 నుంచి అమాంతం రూ. 2651 పెరిగి ప్రస్తుతం రూ.17,043 చేరుకుంది. పెరిగిన ధరలు ఈ నెల నుంచే అమల్లోకి రానున్నాయి. దీని వల్ల రైతులకు ఈ నెలలో అదనంగా రూ. 12 కోట్లు లబ్ధి చేకూరనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. గతంలో ముడి పామ్ ఆయిల్ దిగుమతిపై సుంకం ఎత్తివేయడంతో ఆయిల్ పామ్ గెలల ధర తగ్గి రైతులు నిరాశలో ఉన్నారని, కొత్తగా ఆయిల్ పామ్ వైపు సాగు వేయాలనుకున్న రైతులపై ప్రతికూల ప్రభావం చూపించిందని మంత్రి తుమ్మల అన్నారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో మంత్రి తుమ్మల ఆయిల్ పామ్‌అంశంపై కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయిల్ పామ్‌కు అధిక ధరలను అందించి, రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేసి కొత్త రైతులను ప్రోత్సహించే విధంగా సహకరించాలని, ముడి పామ్ ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని తిరిగి విధించి దేశీయ పామ్ ఆయిల్ రైతులను ఆదుకొనే విధంగా చర్యలను తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ను కోరారు. అంతేకాకుండా ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కు ఈ విషయంపై మంత్రి తుమ్మలతో పాటు ఆయిల్ పామ్ రైతులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 44,444 ఎకరాల పామ్ ఆయిల్ తోటల నుంచి సాలీన 2.80 లక్షల టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ధరల పెరుగుదలతో 9,366 మంది ఆయిల్ పామ్ రైతులకు లబ్ధి చేకూరుతుందని మంత్రి తుమ్మల వివరించారు. పామ్ ఆయిల్ దిగుమతిపై భారత ప్రభుత్వానికి సంవత్సరానికి 80 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఖర్చవుతుందని, దిగుమతి సుంకాలు విధించడంతో దేశంలోని పామ్ ఆయిల్ రైతులు, ముఖ్యంగా తెలంగాణ పామ్ ఆయిల్ రైతులు ప్రయోజనం పొందుతారని, అంతేకాకుండా గెలల ధరల పెరుగుదల వలన నూతనంగా రైతులు పామ్ ఆయిల్ వైపు మొగ్గు చూపే అవకాశం ఏర్పడనుందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 31 జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ చేపట్టేందుకు 14 కంపెనీలకు అనుమతులిచ్చిందని, ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 2.23 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగు చేపట్టుతున్నట్లు వెల్లడించారు. తాజాగా పెరిగిన ధరల నేపథ్యంలో రాష్ట్రంలో చాలా మంది రైతులు పామాయిల్ సాగు వైపు చూసే అవకాశం ఉందని, ఆయిల్ పామ్‌కంపెనీలు ఇందుకోసం సన్నద్ధం కావాలని మంత్రి తుమ్మల సూచించారు.

# వినియోగదారులకు షాక్..

- పెరిగిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర
- 19 కేజీల సిలిండర్‌పై రూ.48.50 భారం
- అక్టోబర్ 1 నుంచే అమల్లోకి..

**జనపదం, న్యూఢిల్లీ :** ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు మరోసారి షాక్ ఇచ్చాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను పెంచాయి. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ. 48.50 మేర పెరిగింది. ఈ మేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు మంగళవారం ఉదయం ప్రకటించాయి. పెరిగిన ధరలు అంటే అక్టోబర్ 1 నుంచే అమల్లోకి రానున్నట్లు వెల్లడించాయి. ధరల పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,691 నుంచి రూ.1740కి పెరిగింది. కోల్‌కతాలో రూ.1,802 నుంచి రూ.1,850.50కి, ముంబైలో రూ.1,644 నుంచి రూ. 1,692.50కి, చెన్నైలో రూ.1,855 నుంచి రూ.1,903కి పెరిగాయి. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. కాగా అంతకుముందు సెప్టెంబర్ 1, ఆగస్టు 1న కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను కంపెనీలు పెంచాయి. ఇక 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదని, పాత ధరలే యథాతథంగా కొనసాగుతాయని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి. ప్రతి నెల 1వ తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ధరలను సవరిస్తుంటాయి. అందులో భాగంగా మంగళవారం కూడా సవరించిన ధరలను ప్రకటించాయి.



**మూడు నెలల్లో ఎంత పెరిగింది?**

దేశంలోని నాలుగు మెట్రో నగరాల్లో వరుసగా మూడు నెలలుగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దేశంలోని పలు మెట్రో నగరాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సగటున రూ.94 పెరిగింది. ఐవోసీఎల్ డేటా ప్రకారం, ఢిల్లీలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర మూడు నెలల్లో రూ.94 పెరిగింది. కోల్‌కతా, ముంబైలాంటి నగరాల్లో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర ఈ కాలంలో రూ. 94.5 పెరిగింది. కాగా చెన్నైలో మూడు నెలల్లో కమర్షియల్ గ్యాస్ ధర రూ.93.5 పెరిగింది.

# మూసీ పాపం మీదే..

- బీఆర్ఎస్ మొదలుపెట్టిందే మేం చేస్తున్నాం..
- వాళ్ల పాలనలో 8,480 అక్రమ కట్టడాలు గుర్తించారు..
- అనవసర రాద్ధాంతం వద్దు..
- ప్రజల మద్దతుతోనే ప్రక్షాళన చేస్తాం..
- మంత్రి శ్రీధర్ బాబు



**జనపదం, సిటీబ్యూరో:** మూసీ నది ప్రక్షాళనపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను మంత్రి శ్రీధర్‌బాబు తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన మూసీ ప్రక్షాళన అంశాలను వివరించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. మూసీ రివర్ ఫ్రంట్ తెచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు.మూసీకి 50 మీటర్ల దూరంలో బఫర్ జోన్‌ను నిర్ణయించి జీవో జారీ చేయడమే కాకుండా, 2017లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ నేతలు చేసిన పనులు మర్చిపోయినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. గతంలో మూసీని కాలుష్య రహితంగా చేయాలని కేసీఆర్ చెప్పలేదా? అంటూ ప్రశ్నించారు. మూసీలో అక్రమ కట్టడాలు గుర్తించాలని గతంలో కేసీఆర్ ఆదేశించలేదా? అని నిలదీశారు.

**మీరు చేస్తే మంచి, మేము చేస్తే తప్పా..**

2021లో మూసీ నది ప్రక్షాళనపై అప్పటి మంత్రి కేటీఆర్ ఎన్నో సమావేశాలు నిర్వహించారని, మాస్టర్ ప్లాన్‌ను పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లను ఆదేశించారని వెల్లడించారు. మూసీకి ఇరువైపులా 50 మీటర్లను బఫర్‌జోన్‌గా గుర్తించాలని జీవో జారీ చేసిందన్నారు. అప్పటి అధికారుల లెక్కల ప్రకారం 8,480 అక్రమ కట్టడాలు ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. మూసీ బఫర్‌జోన్ గుర్తింపుపై గత ప్రభుత్వమే జీవోఎంఎస్ 7ను జారీ చేసిందని, ఆ జీవో ప్రకారమే మేము ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. మీరు చేస్తే మంచి, మేము చేస్తే మాత్రం తప్పా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రక్రియ చాలా క్లిష్టమైందని వెల్లడించారు. ఈ సమస్యలను బీఆర్ఎస్ నేతలు ఇంకా జఠిలం చేస్తున్నారని మండిపడ్డారు. అందరికీ ఉపయోగపడే పనులపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారంటూ ప్రశ్నించారు.

**ప్రజల మద్దతుతోనే ప్రక్షాళన చేస్తాం..**

మూసీలో 1.50లక్షక్యూసెక్కులు దాటి నీళ్లు వస్తే ఆ పరివాహక ప్రాంత ప్రజలకు ప్రమాదం అని సర్వేలు చెప్తున్నాయన్నారు. అయినా అన్ని రకాల నిర్ణయాలు తీసుకొని గత ప్రభుత్వం మూసీ ప్రక్షాళనను పక్కన పెట్టిందన్నారు. వాళ్లు ఆలోచన చేసిన నిర్ణయాలను మేము అమలు చేస్తే తప్పు చేసినట్లా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజలను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తోందన్నారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల విషయంలో కనికరం చూపించలేదనీ వారికి డబుల్ బెడ్ రూమ్ లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రజల మద్దతుతోనే మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు.

## డేరా బాబాకు మరోసారి పెరోల్..

- నాలుగేళ్లలో 15వ సారి



**జనపదం, బ్యూరో :** ఇద్దరు మహిళలపై లైంగికదాడికి పాల్పడ్డాడన్న కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబా మరోసారి జైలు నుంచి బయటకు రానున్నారు. అక్టోబర్ 5వ తేదీన హర్యానా అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డేరా బాబా పెట్టుకున్న పెరోల్ పిటిషన్‌ను ఎన్నికల సంఘం సోమవారం ఆమోదించింది. ఎన్నికల సంఘం ఆమోదం నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం ఆయన విడుదలకు త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు రానున్నారు. డేరా బాబాకు హర్యానాలో లక్షలాది మంది అనుచరులున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బయటకొస్తే ఈ ఎన్నికలపై పెను ప్రభావం పడనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, పెరోల్ సమయంలో ఆయన హర్యానాలోకి ప్రవేశించకుండా నిషేధం విధించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వ్యక్తిగతంగా లేదా సోషల్ మీడియా ద్వారా ఎలాంటి ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనే వీలుండదని సమాచారం. కాగా, ఎన్నికల సంఘం నిర్ణయంతో డేరా బాబాకు తొమ్మిది నెలల్లో పెరోల్ లభించడం ఇది మూడోసారి, ఇక గత నాలుగేళ్లలో 15వ సారి కావడం గమనార్హం.

## ఉమ్మడి జిల్లాకో ప్రత్యేక అధికారి..

**ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్**

**జనపదం, బ్యూరో:** తెలంగాణలోని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి పది జిల్లాలకు పది మంది ఐఏఎస్ అధికారులను నియమించింది. ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయాలని స్పెషల్ ఆఫీసర్లను సర్కారు ఆదేశించింది. కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక హైదరాబాద్ జిల్లా బాధ్యతలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి అప్పగించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యతలను సురేంద్ర మోహన్‌కు ఇచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్‌కు ఇలంబర్తి, కరీంనగర్‌కు ఆర్వీ కర్ణన్, నల్గొండకు అనితా రామచంద్రన్, రంగారెడ్డికి డీ దివ్య, నిజామాబాద్‌కు ఏ శరత్, మహబూబ్‌నగర్‌కు రవి, వరంగల్‌కు టీ వినయ్ కృష్ణారెడ్డి, ఉమ్మడి మెదక్‌కు హరిచందనను నియమిస్తూ సర్కారు సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నది

## తెలంగాణలో రెండురోజుల పాటు వర్షాలు..

**హెచ్చరించిన వాతావరణ కేంద్రం.**

**జనపదం, బ్యూరో :** తెలంగాణలో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. కొమరిన్ ప్రాంతంలోనున్న ఉపరితల ఆవర్తనం ఉత్తర ఇంటీరియర్ కర్నాటక వరకు తమిళనాడు మీదుగా ఉన్న సగటు సముద్రమట్టానికి 0.9 కి లో మీటర్ల వరకు విస్తరించి ఉందని పేర్కొంది. మంగళవారం పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని చెప్పింది. బుధవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మానుకోట, రంగారెడ్డి, వికారాబాద్, సంగా రెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# రూ. ఏడు కోట్ల మోసం..

- వర్ధమాన్ గ్రూపు ఎండీని డిజిటల్ చోరీ చేసిన సైబర్ నేరగాళ్లు
- వర్చువల్ ఫేక్ కోర్టు రూమ్‌ను తయారు చేసి బెదిరింపు
- రూ. 5.25 కోట్లు రికవరీ



**జనపదం, న్యూఢిల్లీ :** వర్ధమాన్ గ్రూప్ అధినేత ఎస్పీ ఓస్వాల్ ను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఆయన నుంచి ఏడు కోట్ల రూపాయలు లాగేశారు. సీజేఐ డీవై చంద్రచూడ్ గెటప్‌లో.. ఓ వర్చువల్ ఫేక్ కోర్టు రూమ్‌ను తయారు చేసి.. ఎస్పీ ఓస్వాల్‌ను బెదిరించారు. టెక్స్‌టైల్ సంస్థ ఎండీ అయిన ఓస్వాల్.. ఆగస్టు 28, 29వ తేదీల్లో డిజిటల్ చోరీకి గురయ్యారు. పలు అకౌంట్లకు ఏడు కోట్లు బదిలీ చేసేలా ఆయన్ను వత్తిడి చేశారు. అయితే ఆ అకౌంట్లను ఫ్రీజ్ చేసి, వాటి నుంచి సుమారు ఐదు కోట్ల రూపాయలను రికవరీ చేశారు. సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేశారన్న విషయాన్ని ఆ వ్యాపారవేత్త వివరించారు.మనీ ల్యాండరింగ్ కేసులో విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరిస్తూ ఆ సైబర్ గ్యాంగ్ ఏడు కోట్లు వసూలు చేశారు. మీ పేరుతో కెనరా బ్యాంక్ అకౌంట్ ఉందని, ఆ అకౌంట్ నుంచి ఆర్థిక అక్రమాలు జరిగాయని గ్యాంగ్ బెదిరించింది. ఆ అకౌంట్‌కు నరేశ్‌గోయల్ కేసుతో లింకు ఉన్నట్లు మోసగాళ్లు బెదిరించినట్లు తెలుస్తోంది. వీడియోకాల్ చేసి ఓ ఫేక్ కోర్టురూమ్‌ను సృష్టించారు. ఆ కోర్టు రూమ్‌లో సీజేఐ చంద్రచూడ్ తన కేసును విచారిస్తున్నట్లు ఫ్రాడ్‌స్టర్లు చూపించారని ఓస్వాల్ తెలిపారు. వాట్సాప్ ద్వారా సీజే ఇచ్చిన ఆదేశాలను పంపించారు. ఆ ఆదేశాల ప్రకారం ఓస్వాల్ వేర్వేరు అకౌంట్లలో ఏడు కోట్లు జమ చేశాడు. నరేశ్ గోయల్ కేసు నుంచి రక్షిస్తామని హామీ ఇస్తూ.. ఫేక్ సుప్రీంకోర్టు ఆదేశాలు తనకు పంపినట్లు ఓస్వాల్ తెలిపారు. ఓస్వాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగస్టు 31వ తేదీన కేసు నమోదు చేశారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైం సెంటర్ ద్వారా మూడు అకౌంట్లను సీజ్ చేశారు. వాటి నుంచి రూ. 5.25 కోట్లు రికవరీ చేశారు. ఈ నేరం వెనుక అంతరాష్ట్ర గ్యాంగ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు అతాను చౌదరీ, ఆనంద్ కుమార్‌ను గౌహతిలో అరెస్టు చేశారు. ఆ ఇద్దరూ వ్యాపారులే. ఈ కేసులో మాస్టర్‌మైండ్, బ్యాంక్ ఉద్యోగి రూమి కాలిటా కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిమ్మి భట్టాచార్య, అలోక్ రంగి, గులామ్ ముర్తాజా, జాకిర్ కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

# తాటాకు చప్పుళ్లకు భయపడం..

- ఇందిరమ్మ రాజ్యమంటే దాడులా..?
- మేం మలుచుకుంటే కాంగ్రెస్ కనుమరుగే..
- కేటీఆర్ మీద దాడి కాంగ్రెస్ దుశ్చర్య
- బీఆర్ఎస్ తలచుకుంటే గతంలోనే హస్తం కనుమరుగు
- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్



**జనపదం, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ తాటాకు చప్పుళ్లకు బీఆర్ఎస్ పార్టీ భయపడదని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు బాధితుల పరామర్శకు వెళ్లిన కేటీఆర్ కాన్వాయ్ పై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మీద తెలంగాణ ప్రజలకు 10 నెలల్లోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దాన్ని నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికే ఈ విధంగా దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. మళ్లీ ఇలాం దెబ్బ తీయడం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద విషయం కాదని హెచ్చిరంచారు. ఇందిరమ్మ రాజ్యం అని ప్రగాల్భాలు పలికి సర్కార్ ను ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ ఎమర్జెన్సీ పాలనను తెలంగాణలో తీసుకువచ్చారని దుయ్యబట్టారు. ప్రజాపాలనలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులపై అధికార పార్టీ నాయకులు దాడి చేస్తారా..? అని ప్రశ్నించారు. గత పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో ఒక్క విపక్ష నాయకుడిపై కూడా దాడి జరగలేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మాదిరిగానే గతంలో బీఆర్ఎస్ పార్టీ ఆలోచిస్తే నేడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నామరూపాలు లేకుండా పోయేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లపై కాన్వాయ్ పై దాడులకు ఇబ్బంద పడుడి ద్దానవని ని మండిపడ్డారు. ఇలాంటి రౌడీ రాజకీయాలకు పాల్పడితే కాంగ్రెస్ పార్టీని మూసీలో కలపడం ఖాయమని హెచ్చరించారు.





## టాటా గ్రూప్‌లోని రెండు ఎయిర్‌లైన్స్ విలీనం

**ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో కలిసిన ఏఐఎక్స్ కనెక్ట్**

**జనపదం, ముంబై:** టాటా గ్రూప్ లోని విమానయాన సంస్థల్లో రెండు విమానయాన సంస్థలు విలీనమయ్యాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లో ఏఐఎక్స్ కనెక్ట్ విలీన ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యింది. పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ) ఈ విషయాన్ని మంగళవారం వెల్లడించింది. అక్టోబర్ 1 నుంచి ఏఐఎక్స్ కనెక్ట్ కింద నమోదైన విమానాలన్నీ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పేరుతో నడవనున్నాయి. విలీన ప్రక్రియ పూర్తికావడంతో విలీనం అనంతర కార్యకలాపాలను పరిశీలిస్తామని డీజీసీఏ తెలిపింది. అదేవిధంగా ఎయిరిండియా – విస్తారా విలీన ప్రక్రియ జరుగుతోందని పేర్కొంది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, ఏఐఎక్స్ కనెక్ట్.. ఈ నాలుగు టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థలే. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్‌ను, ఎయిరిండియాలో విస్తారాను విలీనం చేయాలని టాటా గ్రూప్ నిర్ణయించింది. ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం పూర్తయ్యింది. ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్‌లో రోజువారీగా సుమారు 400 విమాన సర్వీసులు నడుస్తున్నాయి. విలీన సంస్థలో సుమారు ఆరు వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ఇక ఎయిరిండియాలో విస్తారా విలీన ప్రక్రియ నవంబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ విలీన ప్రక్రియ దేశంలో పెరుగుతున్న విమాన ప్రయాణ డిమాండ్‌ను కొంత మేర తగ్గించగలదు. విస్తారా–ఎయిరిండియాలో విలీన ప్రక్రియ కూడా పూర్తయితే మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# ప్రభుత్వంతో కొట్లాడుతా..

- ప్రశాంతంగా పడుకోండి..
- మీ ఇంటి మీదకు ఎవ్వరూ రారు..
- మూసీ బాధితుల వద్ద మధుయాష్కి గౌడ్ సంచలన ప్రకటన



జనపదం, హైదరాబాద్ సిటీ : "ప్రభుత్వం కూల్చివేతలపై నిర్ణయం తీసుకుంటే ఒక న్యాయవాదిగా పోరాడుతాను. అదే విధంగా ప్రభుత్వంతో కూడా ప్రజల తరపున పోరాటం చేస్తాను. కూల్చివేతలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బ్లూ మార్కుకి సంబంధం లేదు" అని మూసీ బాధితులకు మధు యాష్కి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. చైతన్యపురిలోని మూసీ పరివాహక ప్రాంత ప్రజలతో మధు యాష్కి గౌడ్ కలిశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ కు సంబంధించిన బాధితులతో మాట్లాడుతూ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ప్రజల కోసం ప్రభుత్వంతో పోరాటం చేస్తానని, కోర్టులు కూడా ఉన్నాయని, ఒక న్యాయవాదిగా ప్రజల కోసం పోరాటం చేస్తానని ప్రకటించారు. "పిల్లాపాపలతో ప్రశాంతంగా నిద్రపోండి. మీ ఇళ్లు ఎవరూ కూల్చరు. మీ ఇంటిపై ఒక్క గడ్డపార పడదు. మీ ఇంటి మీదికి ఒక ప్రొక్లైన్ రాదు" అని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అన్యాయంగా ఇళ్లు కూలగొడితే సోదరుడిగా, న్యాయవాదిగా పైసా ఖర్చు భారం పడకుండా కోర్టులో కేసు వేసి న్యాయం చేస్తానని అన్నారు. ఈ మేరకు కొత్తపేట, చైతన్యపురి డివిజన్లలో బాధితులను కలిసి ఆయన మాట్లాడారు.

# రూ.1.21 కోట్ల హవాలా డబ్బు

- పట్టుకున్న పోలీసులు



జనపదం, క్రైం: హైదరాబాద్ సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా హవాలా డబ్బు పట్టుపడింది. వాహన తనిఖీలలో రూ.1 .21 కోట్లు పట్టుబడింది. సుల్తాన్ బజార్ పోలీసులు మంగళవారం సాయంత్రం బొగ్గులకుంటలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా బైక్ పై వస్తున్న ఇద్దరిని పోలీసులు ఆపేందుకు యత్నించారు. వారు పోలీసులను తప్పించుకొని పోవడంతో కోఠి హనుమాన్ టెక్డీ వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్ (27), వసంత్ (24) అనుమానాస్పదంగా, ఓ బ్యాగ్ను తరలిస్తుండటం గమనించారు. ఆ బ్యాగ్ను తనిఖీ చేయగా అందులో కోటి రూపాయల నగదు పట్టుబడింది. వారిని విచారించగా, తమకు ఆ డబ్బుతో ఎలాంటి సంబంధం లేదని తన ప్రతినిధి ఆదేశాల మేరకు డబ్బులను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వారి ఇచ్చిన సమాచారంతో హనుమాన్ వ్యాయామశాల వద్ద ఉన్న ఓ అపార్ట్మెంట్లో తనిఖీ చేయగా, అక్కడ రూ.21 లక్షలు పట్టుబడ్డాయి. అక్కడ ఉన్న మరోవ్యక్తి తరుణ్ను విచారించగా, ముంబయిలో ఉండే బబ్లూ అనే హవాలా వ్యాపారి ఆదేశాల అనుసారంగా, తాము పని చేస్తున్నామని తరుణ్ తెలిపాడు. నగరంలో ఉండే వ్యాపారుల నుంచి ఈ లావాదేవీలు సాగిస్తున్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు. హవాలా డబ్బు తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1.21 కోట్ల నగదు సీజ్ చేసి ఇన్కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు బబ్లూను త్వరలో అరెస్ట్ చేస్తామని డీసీపీ వివరించారు.





# సాయం అందింది..

- తెలుగు రాష్ట్రాలకు కేంద్రం వరద ఉపశమనం...
- తెలంగాణకు రూ. 416 కోట్లు.. ఏపీకి రూ.1036 కోట్లు
- ప్రాథమిక నివేదికల ప్రకారం నిధులు
- కేంద్ర బృందాల పూర్తి నివేదిక తర్వాత మరిన్ని..
- ప్రకటించిన కేంద్ర హోం శాఖ

**జనపదం, న్యూఢిల్లీ:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా వరద ప్రభావిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. మొత్తం 14 రాష్ట్రాలకు రూ.5,858.60 కోట్ల నిధులను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ వాటాలో భాగంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్(ఎస్డీఆర్ఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్(ఎస్డీఆర్ఎఫ్) అడ్వాన్సు నుంచి ఈ నిధులను మంజూరు చేసింది. తెలంగాణకు రూ. 416.80 కోట్లు, ఆంధ్రప్రదేశ్కు రూ.1,036 కోట్లను విడుదల చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,432 కోట్లను ఇచ్చింది. గుజరాత్కు రూ.600 కోట్లు, కేరళకు రూ.145.60 కోట్లను కేటాయించింది. రాష్ట్ర విపత్తు నిధికి ఎస్డీఆర్ఎఫ్ నుంచి కేంద్రం వాటాగా ఈ మేరకు నిధులను విడుదల చేసింది. ఇటీవల భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ, కేరళ సహా వరద ప్రభావిత రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించాయి. వరదల వల్ల ఆయా రాష్ట్రాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేస్తూ నివేదిక ఇచ్చాయి. దీంతో తక్షణ సాయంగా కేంద్ర హోంశాఖ నిధులను మంజూరు చేసింది.

**పరిశీలించిన పెద్దలు..**

రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్సింగ్ చౌహాన్తో పాటు, కేంద్ర బృందం పర్యటించి వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలతో జరిగిన నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసి రూ. 10 వేల కోట్లు నష్టపోయినట్లు నివేదికలు ఇచ్చింది. అయితే, ఆయా నష్టాలను అంచనా వేసిన కేంద్రం.. తక్షణ సాయంగా ఈ నిధులు కేటాయించింది. కేంద్ర బృందాల నుంచి పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని నిధులు మంజూరు చేస్తామని కేంద్ర హోం శాఖ ప్రకటించింది.

**14 రాష్ట్రాలకు..**

మంగళవారం రాత్రి మొత్తం 14 రాష్ట్రాలకు వరద సాయం విడుదల చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇందులో అస్సాంకు రూ. 716 కోట్లు, బిహార్కు రూ. 655.60 కోట్లు, గుజరాత్కు 600 కోట్లు, హిమాచల్ ప్రదేశ్కు 189.20 కోట్లు, కేరళకు రూ. 145.60 కోట్లు, మణిపూర్కు 50 కోట్లు, మిజోరంకు 21.60 కోట్లు, నాగాలాండ్కు రూ. 19.20 కోట్లు, సిక్కింకు 23.60 కోట్లు, త్రిపురకు 25 కోట్లు, పశ్చిమ బెంగాల్కు 468 కోట్లు కేటాయించారు.

# ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమా..?

- మూసీ ప్రక్షాళన అంతా కోరుతున్నారు..
- ప్రజలను రెచ్చగొట్టడం సరికాదు..
- అవసరమైతే ప్రజలతో తిరుగుబాటు చేయిస్తాం..
- విపక్షాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరిక..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న మూసినది ప్రక్షాళన విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విపక్ష పార్టీలకు సవాలు విసిరారు. మూసీ ప్రక్షాళన కు కమిటీ వేస్తామన్న ఆయన అందులో బీఆర్ఎస్ నేతలకు కూడా చోటు కల్పిస్తామని చెప్పారు. మూసి ప్రక్షాళనను అడ్డుకుంటే ప్రత్యేక ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అమాయక ప్రజలను రెచ్చగొట్టి వారిని రోడ్ల మీదికి తీసుకువస్తారని మండిపడ్డారు. అవసరమైతే ప్రభుత్వం, నల్గొండ ప్రజలతో కలిసి రజాకార్లతో కొట్లాడినట్టు కొట్లాడుతామన్నారు. మూసి ప్రక్షాళనకు ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చయినా ఆ ప్రక్రియను పూర్తి చేసి తీరుతామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, హరీష్, కేటీఆర్ నల్గొండ జిల్లాపై కక్ష కట్టారన్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ మాత్రమే కాదనీ కోట్ల మంది బ్రతుకులను కాలుష్యం నుంచి కాపాడే శుద్ధీకరణ అన్నారు. రెండు దశాబ్దాలుగా తాను ఫ్లోరైడ్, మూసీ శుద్ధీకరణ మీద పోరాటం చేస్తున్నానన్నారు. మూసీ పరివాహక ప్రాంత పరిధిలో వివిధ కంపెనీలు రసాయన వ్యర్థాలను మూసీలోకి వదిలిపెడుతుండటంతో నది అంతా కాలుష్యంగా మారి నల్గొండ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నదన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు నదులను శుభ్రం చేసుకొని ప్రజలను వ్యాధులనుంచి దూరం చేసుకుంటుంటే మన దగ్గర ప్రతిపక్షాలు మాత్రం మూసీ ప్రక్షాళన ఎందుకని గగ్గోలు పెడుతున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు మూసీ బాధితులను తెలంగాణ భవన్ కు పిలిపించుకొని తమది జనతాగ్యారేజీ అని సోషల్ మీడియాలో తిప్పుకుంటున్నారని మండిపడ్డారు. అసలు అది జనతా గ్యారేజ్ కాదనీ జనాన్ని ముంచే, జనాల్ని వంచించే గ్యారేజీ అన్నారు. అందుకే ఆ కారు గ్యారేజీకి పరిమితమైందని సెటైర్లు వేశారు.

**ఫామ్ హౌజుల్లో మీరు.. కాలుష్యంలో మేమా..?**

మూసీ నది కలుషితం కాని ప్రాంతాల్లో ఫాంహౌజ్లు కట్టుకున్న కేటీఆర్, హరీష్రావు హైదరాబాద్కు 100 కి.మీ దూరంలోని ఎర్రవెల్లిలో సువిశాల ఫాంహౌజ్ కట్టుకున్న కేసీఆర్లు వచ్చి ఒక్క నెల మూసీ తీరాన ఉండాలన్నారు. 70 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ కు మూసీ గురించి తెలియకపోవడం బాధాకరమన్నారు. ఓ వైపు ఫ్లోరిన్.. ఇంకో వైపు మూసీతో జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న ఆయన మూసిని ప్రక్షాళన చేస్తేనే తమ జిల్లా ప్రజలకు విముక్తి కలుగుతుందన్నారు. మానవత్వం ఉన్న మనుషులైతే మూసీ ప్రక్షాళనకు మద్దతు ఇస్తారని చెప్పారు. మూసీ ప్రక్షాళనలో ప్రజలను ఒప్పిస్తామన్న ఆయన బాధిత కుటుంబాలకు డబుల్బెడ్రూం ఇచ్చి వారిని ఆదుకుంటామన్నారు. ప్రధానితో పాటు కేంద్రంలో ఎందరో మంత్రులను కలిసి మూసీ శుద్ధీకరణకు నిధులు కేటాయించాలని వినతులు ఇచ్చానన్న ఆయన మూసీ ప్రాంతంలో తాను తిరగని ఇళ్లు, కేంద్రంలో కలవని నాయకుడు లేరన్నారు. మూసీ ప్రక్షాళనకు నిధులు ఇస్తామని మాట ఇచ్చి మొఖం చాటేశారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు.

# సీఎం ఔట్...

- సీఎం ఇంటికెళ్లే సమయం వచ్చింది
- హైడ్రా పేరుతో రాష్ట్రాన్ని దోస్తున్నారు
- కప్పం కట్టేందుకే ఢిల్లీకి సీఎం
- మూసీ ప్రక్షాళన జేబులకే..
- రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రిగా చరిత్రలో ఉంటారు
- బీజేపీ రైతుల పక్షపాతి
- హైడ్రాను బంద్ పెట్టే రోజు త్వరలోనే వస్తుంది.. రైతు దీక్షలో బీజేపీ నేతల

**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో ఆరాచకపాలన నడుస్తోందని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజినీలా ప్రవర్తిస్తూ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అన్ని సామాజిక వర్గాలను మోసం చేశారని, రేవంత్ రెడ్డి ఢిల్లీటు తెలంగాణకు చక్కర్లు కొడుతున్నారని, ఢిల్లీలో కప్పం కట్టేందుకు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణకు ముఖ్యమంత్రినా..? ఢిల్లీకి కప్పం కట్టే మంత్రినా అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన జేబులు నింపుకోవడానికే తప్ప మరొకటి లేదని, కాంగ్రెస్ చరిత్రంతా అవినీతేనన్నారు. కేంద్ర ప్రభుత్వంపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్రెడ్డి నేతృత్వంలో చేపట్టిన రైతు హామీల సాధన దీక్షను మంగళవారం విరమించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన 8 హామీలైన రైతు రుణమాఫీ, రైతుబీమా, రైతు భరోసా, కౌలు రైతులు, కూలీలు, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అంశాలపై సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన దీక్షను మంగళవారం ఉదయం 11 గంటలకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి అభయ్ పాటిల్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. రైతు హామీల సాధన దీక్ష స్థలి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్లపై బీజేపీ ప్రజాప్రతినిధులు నిప్పులు చెరిగారు.

**తెలంగాణ తుగ్లక్ రేవంత్..**

ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి అభయ్ పాటిల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడువు ముగిసిందని, ఆయన ఇంటికి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయలేదని, తెలంగాణ తుగ్లక్ రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో ఇలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమస్యను వెతకాల్సిన అవసరం లేదని, అధికార పార్టీ వాళ్లే అనేక సమస్యలు సృష్టించి మనకు ఇస్తున్నారన్నారు.

**ట్యాక్సుల్లా వసూళ్లే..**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో ట్యాక్సుల పేరుతో రూ.కోట్లు వసూళ్లు చేసిందని బీజేపీఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ఆర్, బీ ట్యాక్స్, ఆర్ఆర్ఆర్ ట్యాక్సీల అవినీతిని బయట పెట్టామని, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్లో పొంగులేటి కమీషన్, మేఘా కంపెనీల కమీషన్లు బయట పెట్టామన్నారు. తుమ్మల నాగేశ్వర్ రావు మాటలను ఖండిస్తున్నామని, మోడీ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని తుమ్మలకు గుర్తు చేస్తున్నామని ఏలేటి అన్నారు. బీజేపీ రైతుల పక్ష పాతి అని, హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, వసూళ్లు చేసిన డబ్బును ఢిల్లీకి కప్పం కడుతున్నారని విమర్శించారు.

**అప్పుడూ.. ఇప్పుడు ఒకే పాలన : ధర్మపురి అరవింద్**

గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్ రెడ్డి ఒకే విధానాలను అమలు చేస్తున్నారని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. హైడ్రా పేదల ఇళ్లనే కూల్చివేస్తుందని ఎంపీ అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కాంగ్రెస్లు ఒక్కటేనని, జన్వాడ ఫామ్హౌస్ ఎందుకు కూల్చడం లేదని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. రైతుల గోస కాంగ్రెస్కు గుర్తుచేసే దీక్ష ఇది అని, ప్రతి జిల్లాకు ఈ దీక్షలు తీసుకెళ్తామని తెలిపారు. హైడ్రాపై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందని ఎద్దేవా చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసిందే ప్రధాని నరేంద్ర మోడీ అని అర్వింద్ పేర్కొన్నారు. పేదల ఇళ్లనే కూల్చి వేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో కొందరు బ్లాక్మెయిల్ చేస్తూ జేబులు నింపుకుంటున్నారని ధ్వజమెత్తారు.



**సీఎం రేవంత్ కి కోర్టు మొట్టికాయలు..**

సీఎం రేవంత్ రెడ్డి ఎవ్వరి మాట వినడం లేదని, ఎవరి మాట వినని వాడు సైకో అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైకోర్టు వేసిన మొట్టికాయలు నేరుగా రేవంత్ రెడ్డికి తగిలాయని, చట్టం మీద గౌరవం ఉంటే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి శాసనసభలో అనేక సమస్యల మీద ప్రస్తావించినా కూడా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే సత్తా, శక్తి భారతీయ జనతా పార్టీకే ఉందని, ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పడుతుందన్నారు. బేషరతుగా రూ.2 లక్షలు రైతుల అకౌంట్ లో జమ చేయాలని, లేదంటే నమ్మిన రైతులే ఈ ప్రభుత్వాన్ని బొందపెడతారని హెచ్చరించారు. రేవంత్ బ్రెయిన్ చైల్డ్ ఉందని, హైడ్రా, మూసీ ప్రక్షాళనపై కోర్టు చివాట్లు పెట్టి, మొట్టికాయ వేసిందన్నారు. నిజంగా రేవంత్ రెడ్డికి చట్టం మీద నమ్మకం ఉంటే వెంటనే రాజీనామా చేయాలని, కోర్టులు, జడ్జీలు అంటే లెక్కలేదా అని ప్రశ్నించారు.

**జన్వాడ ఫామ్ హౌస్ ఎందుకు కూల్చడం లేదు..?**

బీఆర్ఎస్, కాంగ్రెస్లు ఒక్కటేనని, జన్వాడ ఫామ్హౌస్ ఎందుకు కూల్చడం లేదని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ను మళ్లీ లేపే పని కాంగ్రెస్ పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్లో బీఆర్ఎస్ ఉందా? లేదా బీఆర్ఎస్లో కాంగ్రెస్ ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియక, ఢిల్లీ పెద్దలు ఆరు గ్యారెంటీలను ప్రకటించారని, ఇప్పుడు ఏం చేయాలో కాంగ్రెస్ నేతలకు అర్థం కావడం లేదని విమర్శించారు. సభ్యత్వం నమోదులో బీజేపీ దూసుకుపోతోందని, తెలంగాణలో అనుకున్న లక్ష్యం ప్రకారం సభ్యత్వ నమోదును అందుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.



# రాహుల్ జీ ఇదేనా ప్రేమ దుకాణం..?

- దాడులు చేయడమే ప్రజాపాలనా..?
- కాంగ్రెస్ నేతకు హరీష్ సూటి ప్రశ్నలు..
- కేటీఆర్ పై దాడికి తీవ్ర ఖండన..
- సీఎంకు మీరిచ్చే సలహాలివా.. అని నిలదీత..

**జనపదం, హైదరాబాద్ సిటీ:** కేటీఆర్ పై కాంగ్రెస్ రౌడీ మూకల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పెద్దలు వల్లెవేసే పదాలను వ్యంగ్యంగా వర్ణించారు. మరీ ముఖ్యమంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి మిస్టర్ రాహుల్ జీ... ఇదేనా మీరు చెప్పిన నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ ఖీ దుకాణ్.(ద్వేషం మార్కెట్ లో ప్రేమ దుకాణం) అంటే నిర్వచనం ఇదా అని ప్రశ్నించారు. మూసీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై దాడి చేయడాన్ని ఏమనుకోవాలో చెప్పాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల మీద దాడులు చేయడమేనా ప్రజా పాలన అంటే అని నిలదీశారు. ప్రజాప్రతినిధుల ఇళ్ల మీద దాడులు, నాయకుల అరెస్టులు, అక్రమ కేసులు.. ఇదేనా రాహుల్ చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని వ్యంగ్యంగా పేర్కొన్నారు. కేటీఆర్ పై దాడికి తెగబడిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని ఈ సందర్భంగా హరీష్ రావు డిమాండ్ చేశారు.

# రేవంత్... శవాలపై పైసలు ఏరుకో..

- హోంగార్డులంటే అంత చులకనా..?
- గోపాల్ కుటుంబాన్ని సర్కారే ఆదుకోవాలి..
- మాజీ మంత్రి హరీష్ రావు..
- హైడ్రా పేరుతో హత్యలు చేస్తోందని రేవంత్ పై మండిపాటు..



జనపదం, సంగారెడ్డి: రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని, హైడ్రా పేరుతో ప్రభుత్వం హత్యలు చేస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సంగారెడ్డి మల్కాపూర్ చెరువులో హైడ్రా కూల్చివేతలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న హోంగార్డ్ గోపాల్ ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తో కలిసి హరీష్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ప్రమాదం జరిగి ఇన్ని రోజులైనా ఒక్క పోలీస్ ఉన్నతాధికారి కూడా వచ్చి పరామర్శించలేదని దుయ్యబట్టారు. హోం గార్డ్ లు అంటే అంత చులకనా..? అని మండిపడ్డారు. ఇప్పటి వరకు హోం గార్డ్ గోపాల్ కుటుంబం చికిత్సకి లక్ష రూపాయలు ఖర్చు చేసిందని, ప్రభుత్వం వైద్య ఖర్చులు భరించడం లేదన్నారు. ప్రమాదకరమైన డిటోనేటర్లతో పేలుళ్లు చేసినప్పుడు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే గోపాల్ ప్రమాదానికి గురి అయ్యారన్నారు. ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేయకుండా గోపాల్ ని ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. హరీష్ వెంట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# తాట తీస్తా..

**(మొదటి పేజీ తరువాయి)** దీంతో ఆ రెండు పార్టీల మధ్య మూసీ చిచ్చు రగులుతోంది. పైగా మూసీ సుందరీకరణ కోసం లక్షా యాభైవేల కోట్ల రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించడంపై కూడా బీఆర్ఎస్ కన్నెర్ర చేస్తోంది. ప్రజలకు అందించాల్సిన పథకాలకు నిధులు లేవంటూనే మూసీలో ఇంత పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తోంది. సుందరీకరణ పేరుతో భారీ స్కాం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు పలువురు మాజీ మంత్రులు ఆరోపిస్తున్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు నిధుల కటకట అంటూ నెలలు దాటేస్తున్న రేవంత్ సర్కార్ మూసీ సుందరీకరణకు ఎక్కడి నుంచి సమీకరిస్తోందో చెప్పాలంటూ నేతలు డిమాండ్ చేస్తున్నారు. పోని ఇంత పెద్దమొత్తంలో నిధులు వెచ్చించినప్పటికీ వ్యవసాయరంగానికి ఏమైనా ఉపయోగమా దీని వల్ల ఎంత మంది రైతుకు నీరందిస్తారో చెప్పాలని గులాబీ నేతలు నిలదీస్తున్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ. ఎనభైవేలు కోట్లు ఖర్చు చేస్తేనే....ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి గోలగోల చేశారన్నారు. అటువంటప్పుడు తాగు నీటికి, సాగునీటికి ఉపయోగపడని మూసీ నదికి లక్ష యాభైవేలు కోట్లను ఖర్చు చేయడం అవసరమా అంటూ ప్రశ్నిస్తోంది. ఇదే సమయంలో 55 కిలోమీటర్ల పరిధిలో ఉన్న మూసీ నది సుందరీ కరణ కోసం కాల్చివేస్తున్న కట్టడాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. దీంతో బాధితులంతా ప్రస్తుతం బీఆర్ఎస్ పక్షాన నిలుస్తున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు బూతులు తిడుతున్నారు.

**పైన పటపట.. లోన గుటగుట..**

జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా, లోన మాత్రం ఈ పరిస్థితి నుంచి ఎలా గట్టెక్కాలన్న అంశంపై మల్లగుల్లాలు పడుతోంది. కూల్చివేతలతో అనవసరంగా బీఆర్ఎస్ కు ఆయుధాన్ని అందించామా..? అన్న సందేహాలు అధికార పార్టీలో నెలకొంది. కాగా కూల్చివేతలను ప్రధాన ఎజెండాగా చేసుకుని గులాబీ నేతలు తమ జోరును మరింత పెంచారు. కూల్చివేతలు జరిగిన ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులకు అండగా ఉండే ప్రయత్నం చేస్తున్నారు. అందరు కలిసి కట్టుగా ఉండి కూల్చివేతలను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిస్తున్నారు. ఇది సహజంగానే బాధితులకు కొండంత అండ ఇచ్చినట్లు అవుతోంది. దీంతో గులాబీ నేతలను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు కూడా రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముషీరాబాద్, అంబర్ పేట్ నియోజకవర్గాల్లో బాధితులను పరామర్శించేందుకు కేటీఆర్ యత్నించారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కేటీఆర్ కాన్వాయ్ ను ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు యత్నించారు. ముషీరాబాద్ లో అయితే కాంగ్రెస్ శ్రేణులు రెచ్చిపోయారు. ఏకంగా కేటీఆర్ కారు ఎక్కి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొందరు ఆయన కారుపై రాళ్ల దాడికి కూడా యత్నించారు. ఈ పరిణామంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారి తీసింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం ముష్టి యుద్ధాలకు దిగుతున్నట్లే కనిపించింది. పరిస్థితి చేయి దాటుతున్నట్లే కనిపించింది. పోలీసులు సకాలంలో జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

**తాటాకు చప్పుళ్లకు భయపడా..**

ప్రజలకు అండగా నిలబడడాన్ని నువ్వు ఆపలేవని సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కేటీఆర్ హెచ్చరించారు. గొడవ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నీ తాటాకు చప్పుళ్లకు భయపడేవాడిని కాదు అని అన్నారు. నీ తాట తియ్యడానికి వచ్చానన్నారు. నీ పిల్లి కూతలకి భయపడేవాళ్ళు ఎవ్వరూ లేరిక్కడ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. నాది ఉద్యమాల పిడికిలి గుర్తు పెట్టుకో అని సీఎంను తీవ్రంగా హెచ్చరించారు. బడుగు బలహీనుల గొంతులను బుల్డోజర్లు తొక్కి పెట్టలేవని, కాంగ్రెస్ గుండా రాజ్యాన్ని, నియంతృత్వ పాలనను సవాలు చేసే తన స్ఫూర్తిని ఆపలేవని సవాల్ విసిరారు. నీ గుండాలు నా వాహనంపై చేసిన దాడి నాకు మరింత శక్తిని ఇస్తుందని కేటీఆర్ అన్నారు.


Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com